క్లుప్తంగా

గుండెపోటుతో గరికపాడు ఎఫ్‌ఏ మృతి



గరికపాడు(కాకుమాను): గరికపాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గేరా రాజశేఖర్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారుల వివరాల మేరకు.. గ్రామంలో కూలీలతో ఉపాధి పనులు చేయించి, ఇంటికి వచ్చే సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు పొన్నూరు ప్రైవేట్ వైద్యశాలకు ఆయనను తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సింగారావు తదితరులు రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.

ఎర్రబాలెంలో యువకుడి ఆత్మహత్య

మంగళగిరి: పాడుబడిన బావిలోకి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి యర్రబాలెం రైస్‌మిల్ వీధిలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి యర్రబాలేనికి చెందిన శిఖా శంకరరావు, రాజేశ్వరి దంపతుల మూడో కుమారుడు గోపాల్ (35)కు, గుంటూరుకు చెందిన అనూషకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి సాయి, చరణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్ కొంతకాలం కిందట సెక్యూరిటీ గార్డుగా పని చేసినా, ప్రస్తుతం తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వేసవి ఎండల నేపథ్యంలో కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఏమి జరిగిందో తెలియదు గానీ గోపాల్ టవల్ కట్టుకుని ఇంట్లోంచి బయటకు వచ్చే క్రమంలో తండ్రి శంకరరావు అడ్డుకుని గేటు వేశాడు. అయినా గోపాల్ దాన్ని తొలగించి సమీపంలో ఉన్న ఓ పాడు బడిన బావిలోకి దూకేశాడు. కుటుంబ సభ్యులు బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నా ఎవరూ పాడు బడిన బావిలోకి దిగి గోపాల్‌ను కాపాడే సాహసం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్‌ఐ క్రాంతి కిరణ్, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బావి వినియోగంలో లేకపోవడంతో పాడుబడింది. నీరు సైతం పాచిపట్టి, తీవ్ర దుర్గంధం రావడంతో సిబ్బంది సైతం బావిలోకి దిగే సాహసం చేయలేకపోయారు. తాడేపల్లి సీతానగరంలోని గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గోపాల్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా చీకటి పడటంతో వీలుపడలేదు. మృతదేహం మంగళవారం ఉదయం నీటిపైకి తేలియాడే అవకాశం ఉందని, అప్పటి వరకూ ఏమీ చేయలేమని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడిపేట 2/7వ అడ్డరోడ్‌లోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో సోమవారం స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో విశ్వేశ్వర శర్మ, గాయత్రి, తోట వీరప్రసాద్ పార్వతి దంపతులు, జంధ్యాల సుబ్రమణ్య శాస్త్రి, పవన్ కుమార్, మల్లికార్జున రావుశర్మ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కేంద్ర నిర్ణయం ఆంధ్రకు తీరని అన్యాయమే

నెహ్రూనగర్: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు పూనుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు తీరని ద్రోహం చేస్తుందని ఎంసీపీఐయూ గుంటూరు జిల్లా కార్యదర్శి అమర్తలూరి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గత 858 రోజులుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని ఉద్యమాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకే మొగ్గుచూపటం ఏపీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాల దస్తగిరి, పిల్లి రాంబాబు, జెట్టి ప్రకాశరావు, కంభం మోజెస్, ఉన్నం రత్నం తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు

పట్నంబజారు: రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బస్సుల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలు పాటించని ఆరు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యా సంస్థలు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, బస్సుల్లో పూర్తిస్థాయి సామగ్రి ఉండాలన్నారు.

ఆశీలు పక్కదారి?

గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ వసూళ్లు ప్రైవేటు దారిపట్టేశాయి. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం మీన-మేషాలు లెక్కిస్తోంది. ప్రైవేటు వ్యక్తులకు వెన్నుదన్నుగా ఉండి వసూళ్లు పర్వానికి ఊతమై నిలుస్తున్నారన్న విమర్శలు నగరంలో పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌కు ఆదాయ వనరుల్లో ఒకటైన ఆశీలు.. ఇవాళ ఈ వ్యక్తుల ఫ్యాంటు-చొక్కా జేబులు పట్టిగ్గా నింపేస్తోంది. వీళ్ల నిర్వాకాన్ని అడ్డుకుట్టవేసే వారు లేకపోవడంతో యథేచ్ఛగా వసూలు తంతు సాగిపోతోంది.

- నగరపాలక సంస్థ అధికారుల మీనమేషాలు
- ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు
- రసీదులపై నగదు ఉండదు!
- జేబులు నింపుకుంటున్న వైనం



పీవీకే నాయుడు మార్కెట్ వద్ద చిరు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): నగరపాలక సంస్థకు ఆదాయం సమాకూర్చేది రెవెన్యూ విభాగమే. ఇంతటి విభాగానికి ప్రధానం ఆదాయమే. అలా వస్తున్న ఆదాయమే దర్జాగా పక్కదారి పడుతోంది. దీనిని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయివేట్ వ్యక్తుల జేబుల్లోకి కార్పొరేషన్ ఆదాయం వెళ్లిపోతోంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి ఆశీలు చేసేందుకు డిపార్ట్‌మెంట్(నగరపాలక సంస్థ సిబ్బంది ద్వారా) కలెక్షన్స్ చేయాల్సి ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా ప్రయివేట్ వ్యక్తులు కలెక్షన్ చేసుకుని వచ్చిన దానిలో సగం తమ జేబుల్లో ఉంచుకుని మిగిలింది అధికారులకు అందజేయడం పరిపాటిగా మారింది.

మార్కెట్, దొడ్ల ఆశీలు వసూలు ఇలా...!

మార్కెట్లు, మరుగుదొడ్లు ఆశీలు వసూలు చేసేందుకు ఆర్‌ఐలు, సంబంధిత వార్డు అడ్మిన్ సెక్రటరీలకు బాధ్యతలు అప్పగించారు. కాని దీనిని కాదని అధికారులు, ప్రయివేట్ వ్యక్తులు కుమ్మక్కై భారీ మొత్తంలో దోచుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

ఆశీలు వసూలు ఇలా..

పీవీకే నాయుడు మార్కెట్ లోపల కూరగాయాలు, వెలుపల గల ఆకు కూరల వారి నుంచి రుసుము రోజుకు రూ.13,244 వసూలు చేయాలి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లిశారద హోల్ సేల్ కూరగాయాల మార్కెట్ నుంచి రోజుకు రూ.24,893 వసూలు చేయాలని ఉత్తర్వులు ఉన్నాయి. లాలాపేట ఎగుమతులు, దిగుమతులు సంబ్రీస్ మార్కెట్ వద్ద రోజులో వేలల్లో వచ్చే నగదు తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. నగరంలో వివిధ ప్రాంతాల్లో 8 చోట్ల ఉన్న మరుగుదొడ్ల నుంచి రోజుకు రూ.13,146 వసూలు చేయాలని కమిషనర్ ఉత్తర్వులు ఉన్నాయి. కాని వీటిలో సగానికి సగం ప్రయివేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్లిపోతుండటం విశేషం. మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి ఓపెన్ ఆక్షన్ (వేలం పాట) పెడితే కార్పొరేషన్‌కు కోట్లల్లో ఆదాయం సమకూరుతుంది. ఆ విధంగా కాకుండా కొంత మంది స్వార్థం కోసం వేలం పాట నిర్వహించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

సంబ్రీస్ మార్కెట్ ఆక్షన్ పెట్టడంలోనూ...

మార్చి 31న సంబ్రీస్ మార్కెట్ ఆశీలు వసూలు గడువు ముగియడంతో ప్రస్తుతం ఆశీలు వసూలు నిలిపివేశారు. ప్రస్తుతం సంబ్రీస్ మార్కెట్‌కు బహిరంగ వేలం పాట నిర్వహిస్తే దాదాపు రూ.3 కోట్లు దాకా ఆదాయం వచ్చేది. కొన్ని అనివార్య కారణాల వల్ల సంబ్రీస్ మార్కెట్ వేలం పాట ప్రక్రియ పెట్టకపోవడంతో రోజుకు రూ.లక్ష చొప్పున నష్టపోతోంది. వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేసి నెలవారీ వసూలు చేసే కార్యచరణ లేకపోవడంతో.. మూడు నెలలకు దాదాపు రూ.90 లక్షలు కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లినట్లయింది.

డిమాండ్ ప్రకారం అశీలు వసూలు చేస్తాం

ఆశీలు డిమాండ్ ప్రకారం ప్రతి రోజూ వసూలు చేసి సంబంధిత అధికారులు నగరపాలక సంస్థకు జమ చేయాల్సిందే. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటాం. ప్రయివేట్ వ్యక్తులు ఆశీలు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వీలైనంత త్వరలో సంబ్రీస్ మార్కెట్, మార్కెట్లు, మరుగుదొడ్లు నిర్వహణకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తాం.

– పెద్ది రోజా, అదనపు కమిషనర్, గుంటూరు నగర పాలక సంస్థ.

నగదు రహిత రశీదులు!!

మార్కెట్ల వద్ద వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు నగరపాలక సంస్థ నుంచి ఇచ్చే రశీదుపై కేటాయించిన నగదు ముద్రించి ఉండాలి. కాని సదరు రశీదుపై ఎటువంటి నగదు ముద్ర లేకపోవడంతో పాటు నగరపాలక సంస్థకు సంబంధించిన స్టాంప్ కూడా లేదు. దీంతో ప్రయివేట్ వ్యక్తులు తమ ఇష్టానుసారంగా చిరు వ్యాపారుల నుంచి నగదు వసూలు చేసుకుంటున్నారు. రోజు పెట్టే చిరు వ్యాపారుల వద్ద రోజుకు రూ.30, అదే విధంగా సీజనల్‌గా వ్యాపారం చేసుకునే వారు (ఈత పండ్లు, తాటి ముంజలు అమ్ముకునే) వద్ద నుంచి రూ.50 నుంచి రూ.100లు, అదే విధంగా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ఆకుకూరలు అమ్మే వ్యాపారుల నుంచి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



నగదు, నగరపాలక సంస్థ స్టాంప్ లేకుండా ఉన్న రశీదు

ఈ-ఆటోల అందజేత



ఈ-ఆటోలను అందజేసిన కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని చౌడవరం, సీఆర్ కాలనీల పారిశుద్ధ్య సిబ్బందికి రెండు ఈ-ఆటోలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్త సేకరణ గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు డస్ట్‌బిన్‌లను శుభ్రం చేయాలని సూచించారు. క్లీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులు అరెస్ట్

పెదనందిపాడు: మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ సోమవారం తెలిపారు. పెదనందిపాడుకు చెందిన టి.కార్తీక్, ఎం.హరిప్రసాద్, కె.ప్రభాస్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సోమవారం ఉదయం పెదనందిపాడులో అరెస్ట్ చేసి బాపట్ల కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

వలంటీర్లు సంక్షేమ రథసారథులు

పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య



అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్న సంక్షేమ రథసారథులు వలంటీర్లు అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పొన్నూరు పురపాలక సంఘ ప్రాంగణంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను ఎమ్మెల్యే కిలారి ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, నిధులు కేటాయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాలు నిరంతరం ప్రజలను మభ్యపెట్టి, మోసం చేయటమే లక్ష్యంగా పెట్టుకుని శాంతి భద్రతలు లోపిస్తున్నాయని తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.116 కోట్లతో సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులుకు అందించటంలో వలంటీర్లు సేవలు గొప్పవన్నారు. సేవా వజ్ర నసీరున్నీసా, దిల్షాద్, సేవారత్న గోపాల్ మంజు, దేవిరెడ్డి వీణ, యాతాటి నాగరాజు, మోహనకృష్ణ, దాసరి శ్రీనివాసరావును ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అవార్డులు అందించి, ఘనంగా సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

స్వచ్ఛ సంకల్పం పథకం కింద క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ ద్వారా పొన్నూరు పురపాలక సంఘానికి కేటాయించిన ఆరు ఈ -ఆటోలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దులూరి రంగారావు, కొల్లేరు శ్రీనివాసరావు, అంబటి రాఘవయ్య, షేక్ షర్మిల, గేరా కుమారి, ఇందేటి వెంకటసుబ్బయ్య, షేక్ మాము, రుద్రపాటి ఆదిశేషు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాతో జీవితానికి రాజయోగం



చేబ్రోలు: విద్యార్థులు యోగా సాధన చేసినట్లైతే రాజయోగంతో జీవిస్తారని తెనాలిలోని సృష్టి హోలిస్టిక్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ యోగా డే ను పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం యోగా ఫ్లాష్‌మాబ్, యోగా ఫర్ హెల్త్ స్పైన్, యోగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగాసన కాంపిటీషన్స్, యోగా ఫర్ పోస్ట్ కోవిడ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తుల సమీకృతికి దోహదపడే సాధనంగా యోగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకుమాను ఎంఈఓ-2గా విజయ్ భాస్కర్



కాకుమాను: కాకుమాను ఎంఈఓ -2గా విజయ్ భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన అమరావతి మండలంలోని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. బదిలీల్లో భాగంగా ఎంఈఓ-2గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ కేఎఫ్ కెనడీకు నియామక పత్రాన్ని అందజేసి, విధుల్లో చేరారు .పలువురు ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

నలుగురు హెచ్‌సీలకు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో (పీఎస్) హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ)గా విధులు నిర్వహిస్తున్న నలుగురికి ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు నలుగురు ఏఎస్‌ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఎస్పీ చొరవతో ఉద్యోగోన్నతి కల్పించడంపై ఏఎస్‌ఐలు సంతోషం వ్యక్తం చేశారు. మేడికొండూరు పీఎస్ హెచ్‌సీ శ్రీనివాసరాజు, లాలాపేట పీఎస్ హెచ్‌సీ ఎస్.కె.ఎం.భాష, అరండల్‌పేట పీఎస్ హెచ్‌సీ చంద్రమోహన్, తెనాలి రెండో పట్టణ పీఎస్ హెచ్‌సీ శ్రీనివాసరావులు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులు పంపిణీ



సీఎం ఆర్‌ఎఫ్ నగదు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

చేబ్రోలు: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పొన్నూరు, నిడుబ్రోలు, మన్నవ, తాళ్లపాలెం ప్రాంతాలకు చెందిన ఐదుగురి కుటుంబ సభ్యులకు రూ.2.66 లక్షల నగదు చెక్కులను అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, షేక్ మాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు షేక్ కరీముల్లా ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులు, కుమారుడు వైఎస్సార్ సీపీ మాజీ కౌన్సిలర్ నయూమ్ బాషాలకు పరామర్శించి అండగా ఉంటామని ఎమ్మెల్యే వెంకటరోశయ్య భరోసా కల్పించారు. కరీముల్లా చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

కాకుమాను: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందుకు నిదర్శనం పదవ తరగతి ఫలితాలేనని ఆమె తెలిపారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలని ఆయన కోరారు. విద్యార్థులు విజయ నిర్మల, వాత్సల్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కెఎఫ్ .కెనడీ, పాఠశాల ప్రిన్సిపల్, ముజావర్ షేక్ అసదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే పురస్కారాలు



జగనన్న ఆణిముత్యాలుకు పురస్కారాలు అందజేస్తున్న హెచ్‌ఎం రమాదేవి

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): విద్యార్థులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తుందని హెచ్‌ఎం రమాదేవి అన్నారు. వట్టిచెరుకూరులోని ఎస్‌ఎంవీసీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 578 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కొండూరు సౌమ్యకు రూ. 3 వేలు, 573 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన కొండమూడి అభిలాష్‌కు రూ. 2 వేలు, 268 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన ఉండ్రాసి రూఫస్‌పాల్, కొమ్మూరి తేజశ్వినికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున నగదు పురస్కారాలను, మెమెంటోలు, సర్టిఫికెట్లును అందించారు. అదేవిధంగా అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి సాంబశివరావును కూడా ఘనంగా సత్కరించారు.

వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందజేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సైన్స్ అండ్ హ్యుమానిటీస్ ఇంజినీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ముత్యం వెంకట రామాంజనేయులు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు వీవీఐటీలో సోమవారం అభినందన కార్యక్రమంలో చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. మ్యాథమెటిక్స్ అండ్ గ్రాఫ్ థియరీ పరిశోధనలకు డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. దూరాన్ని ఉపయోగించి గ్రాఫ్‌లో లైన్ తొలగించడం వల్ల వ్యాసార్థం, వ్యాసాల మార్పుపై చేసిన పరిశోధన పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ పీఎల్‌ఎన్ వర్మ పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ వెంకటరామాంజనేయులును వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరి బాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ బీహెచ్ రాజ్యలక్ష్మి అభినందించారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

స్పందనలో తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు భూ ఆక్రమణను వివరిస్తున్న కమ్మ శివప్రసాద్

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పలువురు అర్జీలను అందజేశారు. తహసీల్దారు సిద్ధార్థకు సమస్యలు వివరించారు. ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కమ్మ శివప్రసాద్ తహసీల్దార్‌ను కోరారు. గ్రామ శివారులోని 176 సర్వే నంబరులో ఉన్న వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురయ్యిందని పేర్కొన్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే.. అప్పటి తహసీల్దార్ ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం విచారించి, వాగు పోరంబోకుగా నిర్ధారించి 'ఇది ప్రభుత్వ భూమి' అని బోర్డు ఏర్పాటు చేశారన్నారు. కానీ ఇప్పుడు ఆ బోర్డు లేదని, వెంటనే బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ సిదార్థకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్.. విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

న్యాయం చేయండి సారూ

ప్రత్తిపాడుకు చెందిన చెన్నుబోయిన రామారావు, పెద సాంబశివరావు, మల్లం రామారావు, బట్టిపాటి కోటేశ్వరరావు, చెన్నుబోయిన తిరుపతమ్మ తమకు వివిధ సర్వే నంబర్లులో అర ఎకరం భూమి ఉందని, అయితే ఈ భూమిని కొందరు తమకు తెలియకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గతంలో తహసీల్దార్‌కు పిర్యాదు చేస్తే, పరిశీలించినా.. స్పందించలేదని, న్యాయం చేయాలంటూ స్పందనలో తహసీల్దార్ సిద్దార్థకు విన్నవించుకున్నారు.

వేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని యడవల్లి ధర్మసత్రంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక పురస్కారాలు ప్రదానం చేశారు. సంపత్‌నగర్‌లోని భారతీ తీర్థ వేద స్మార్త పాఠశాలలోని 45 మంది వేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 1,116ల నగదు, ధావళి, ఆసనములు, కొమ్ము చెంబు, పట్టు అంగవస్త్రాలు, పండ్లు పంపిణీ చేసి సత్కరించారు. వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ యనమండ్రి సురేష్ మాట్లాడుతూ వేద పాఠశాలలను ప్రోత్సహించడానికి పురస్కారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. సత్రం కన్వీనర్ సుభద్ర, ప్రయాగ కృష్ణ, డి.కృష్ణ, ఎస్.వి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ మలేరియా మాసోత్సవ ర్యాలీ



గుంటూరు మెడికల్: జాతీయ మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక శ్రీనివాసరావు తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిగాయి. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఓ. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, ఇతర వ్యాధులు సోకుతాయన్నారు. జూన్‌లో దోమల వ్యాప్తి పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ మాట్లాడుతూ దోమల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు కె.ఎస్. సుకుమార్, ఎస్.పి.ఎస్.సూరి, శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు బి.శ్రీనివాసరావు షేక్. ఇలియాజ్, షేక్. జిలాని, బి.ఆనంద్ షేక్.మౌలాలి, షేక్ నజీర్, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది ,సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశాలు, మున్సిపల్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పంట సాగు హక్కు పత్రాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ, ఏవో బి.శ్రీనివాసనాయక్

చేబ్రోలు: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రం(సీసీఆర్‌సీ) కార్డులను త్వరితగతిన అందించాలని చేబ్రోలు తహసీల్దారు ఏబీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలులోని రైతు భరోసా కేంద్రం -1లో సోమవారం సీసీఆర్‌సీ కార్డులపై వీఆర్వోలు, వీఏఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు గోపాలకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లకు 11 నెలల కాలపరిమితితో కౌలు రైతులకు అందించే సీసీఆర్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను సిబ్బంది తెలియజేయాలన్నారు. ఏవో శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రైతు భరోసా రావాలన్నా, పంటల బీమా వర్తించాలన్నా, పంట రుణం పొందాలన్నా సీసీఆర్ కార్డులు తప్పనిసరి అన్నారు. కౌలు కార్డు వలన భూ యజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.